
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
సోమవారం
13 మే 2024
పేజీలు 8
ప్రకాశం
బాపట్ల

# నేడే ఎన్నికల సమరం



ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ఈవిఎంలు, పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు సందర్శన

హింసకు తావులేకుండా పోలింగ్ ఏర్పాట్లు చేపట్టాలి

స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

వైపాలెం, మార్కాపురం, గిద్దలూరులో పర్యటించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : పోలింగ్ కేంద్రాల్లో విధుల నిర్వహణ కోసం వెళ్తున్న సిబ్బంది కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ఎలాంటి సహాయం అందించడానికైనా జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్ దినేష్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఆయన యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరులలో పర్యటించి ఈ.వి.ఎం.లు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించారు. తీసుకువెళ్లిన సామగ్రిని పోలింగ్ అనంతరం తిరిగి అప్పగించేంతవరకూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఆయా ప్రాంతాలలో సిబ్బందికి అవసరమైన అన్ని వసతులూ కల్పించామని అన్నారు. ఏ విధమైన సహాయం కావాలన్నా బి.ఎల్.ఓలు, సెక్టార్ ఆఫీసర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు. శాంతి భద్రతలకు, ఎన్నికల

మిగతా 3లో



ఓటు యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని
KIMS HOSPITALS™
కిమ్స్ హాస్పిటల్, ఒంగోలు వారు
అన్ని రకాల రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు, ఎం.ఆర్.ఐ. స్కానింగ్, సిటీ స్కానింగ్, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ మొదలగు వైద్య పరీక్షల పై
50% రాయితీతో అందిస్తున్నారు.
ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి
తేది: 13-05-2024 నుండి 18-05-2024
వరకు మాత్రమే తగ్గింపు ఇవ్వడం జరుగుతుంది
గమనిక: OUT పేషంట్స్‌కు మాత్రమే
VOTE
కావున ఈ అవకాశాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాల్సిందిగా కోరుతున్నారు
NH-5, మార్కెట్ యార్డ్ వెనుక, ఒంగోలు. ఫోన్: 08592-667788

# మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకుందాం



**దోమలు కుట్టకుండా ఉండటానికి దోమల కాయిల్స్,దోమ వికర్షక క్రీములు, విద్యుత్ దోమ నిరోధకాలు మరియు హెర్బల్ దోమల లోషన్లు ఉపయోగిస్తారు. కొంత మందికి ఇవి పడక నాసికాకుహరం,చర్మం మరియు గొంతు సమస్యలు వస్తాయి. ప్రజలు దోమలను నియంత్రించడానికి రసాయనాలను ఉపయోగిస్తే ఆరోగ్యం మరియు పర్యావరణం మీద చెడు ప్రభావం కలుగుతుంది. మీరు సహజ మార్గం ద్వారా దోమల నియంత్రణ చేయాలి. అప్పుడు మీ పెరటిలో కొన్ని దోమ వికర్షక మొక్కలను పెంచాలి. ఈ దోమల వికర్షక మొక్కలు దోమలను దూరంగా ఉంచడానికి మరియు మీ యార్డ్ ప్రశాంతంగా ఉండటానికి సహాయపడతాయి. ఇక్కడ దోమలను నియంత్రించడానికి ఇంటిలో ఉండవలసిన కొన్ని మొక్కలు ఉన్నాయి.**

**దోమ వికర్షక మొక్కలు**



రోజ్మేరీ మూలిక యొక్క నూనె ఒక సహజమైన దోమల నివారిణిగా వ్యవహరిస్తుంది. రోజ్మేరీ మొక్క 4 నుంచి 5 అడుగుల వరకు పొడవు పెరుగుతుంది. అలాగే నీలం పువ్వులు కలిగి ఉంటుంది. రోజ్మేరీ మొక్క వెచ్చని వాతావరణంలో బాగా పెరుగుతుంది. శీతాకాలంలో,ఈ మొక్క తట్టుకోవటానికి వెచ్చని నివాసం ఏర్పాటు చేయాలి. కాబట్టి ఒక కుండ లో రోజ్మేరీని పెంచి,శీతాకాలంలో మాత్రం ఇంట్లో ఉంచాలి. రోజ్మేరీని వంటలలో మసాలా కోసం వాడతారు.

తైలము గడ్డి దోమల నియంత్రణ కోసం అద్భుతంగా ఉంటుంది. ఇది ప్రతి సంవత్సరం 2 పొడవు పెరుగుతుంది. అలాగే లావెండర్ రంగు పువ్వులు పూస్తాయి. ఈ తైలము గడ్డి ఆయిల్ ను కొవ్వొత్తులు, పరిమళ ద్రవ్యాలు,లాంతర్లు మరియు ఇతర హెర్బల్ ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తారు.దోమల వలన వచ్చే డెంగ్యూ జ్వరం నివారణకు కూడా తైలము గడ్డి సహాయపడుతుంది. దోమల నియంత్రణ కొరకు కొవ్వొత్తులు మరియు లాంతర్లలో క్రిమిసంహారిక తైలము నూనెను పోయాలి. తైలము గడ్డిలో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. తైలము ఆయిల్ చర్మం కోసం సురక్షితం మరియు మీరు ఏ కాలంలోనైనా రాసుకోవచ్చు. దీని వలన ఎటువంటి నష్టం కలగదు.




బంతి పువ్వు అనేక కీటకాలు,మానవులు మరియు జంతువులు ఇష్టపడని విచిత్రమైన వాసన కలిగి ఉంటుంది. బంతి పువ్వు మొక్క 3 అడుగుల 6 అంగుళాలు వరకు పెరుగుతుంది. బంతిలో ఆఫ్రికన్ ఫ్రెంచ్ అనే రెండు రకాలు ఉన్నాయి. ఇవిరెండు దోమల నివారిణిగా ఉన్నాయి. కూరగాయల మొక్కల సమీపంలో బంతి మొక్కలను వేస్తే అఫిడ్స్ మరియు ఇతర కీటకాలు దూరంగా పోతాయి. బంతి పువ్వు పసుపు, ముదురు నారింజ మరియు ఎరుపు మొదలైన రంగులలో పూస్తుంది. బంతి మొక్క పెరుగుదలకు ఎండ అవసరం ఉంటుంది. దోమల నియంత్రణకు పెరడు, వాకిలి కుండలు మరియు తోటలలో బంతి మొక్కలను పెంచాలి.

కాత్నిప్ అనేది పుదీనా కుటుంబానికి అనుసంధానించబడిన ఒక మూలిక. దీనిని ఇటీవలే దోమల నివారిణిగా ప్రకటించారు. తాజా అధ్యయనం ప్రకారం,ఇది పోలిస్తే 10 రెట్లు ఎక్కువ సమర్థవంతంగా పనిచేస్తుంది. ఈ మొక్క ఎండ లేదా పాక్షిక నీడ ప్రాంతంలో నాటితే 3 అడుగుల ఎత్తు పెరిగే శాశ్వత వృక్షం. ఈ మొక్కకు తెలుపు లేదా లవెందర్ పుష్పాలు పూస్తాయి. దోమలు మరియు ఇతర కీటకాలను నియంత్రించడానికి,పెరడు లేదా డెక్ సమీపంలో వీటిని పెంచాలి. పిల్లులకు ఈ వాసన అంటే చాలా ఇష్టం. అందువల్ల ఈ మొక్క చుట్టూ కంచె వేయాలి. దీనిని దోమలను నియంత్రించడానికి అనేక రూపాల్లో ఉపయోగించవచ్చు. మీరు తాజా ఆకుల చూర్ణం లేదా చర్మంపై ద్రవ రూపంలో ఉపయోగించవచ్చు.

అగేరతుం మొక్క మరొక దోమల నివారిణి వృక్షం. ఈ మొక్కకు కౌమరిన్ సృష్టించే లేత నీలం మరియు తెలుపు పుష్పాలు పూస్తాయి. ఇవి దోమల నివారణకు భయంకరమైన వాసనను కలిగి ఉంటాయి. కౌమరిన్ ను సాధారణంగా కమర్షియల్స్ దోమ నిరోధకాలు మరియు పెర్ఫ్యూమ్ పరిశ్రమలో ఉపయోగిస్తారు. దీనిని చర్మం మీద ఎప్పుడు రుద్దకూడదు. అగేరతుం వేసవి అంతా లేదా పాక్షిక సూర్యుడు ఉన్న ప్రదేశంలో పెరుగుతుంది.

హార్స్ మింట్ కూడా దోమలు నియంత్రణకు సహాయపడుతుంది. హార్స్ మింట్ ప్రత్యేక శ్రద్ధ అవసరం లేని శాశ్వత వృక్షం. దీని యొక్క వాసన క్రిమిసంహారిక తైలము వంటిది. ఇది వెచ్చని వాతావరణం మరియు ఇసుక నేల లో బాగా పెరుగుతుంది. ఈ మొక్కకు పింక్ పువ్వులు పూస్తాయి. హార్స్ మెంట్ లో సహజ శిలీంద్ర నిర్మూలన,బాక్టీరియా లక్ష ణాలు మరియు క్రియాశీల పదార్థాలు ఉంటాయి. దీనిని ఫ్లూ చికిత్సకు కూడా ఉపయోగిస్తారు.



వేప మొక్క బలమైన దోమ నివారిణి మొక్క అని చెప్పవచ్చు. వేప మొక్క క్రిమి వికర్షణ లక్షణాలను కలిగి ఉం టుంది. మార్కెట్ లో అనేక వేప ఆధా రిత దోమ నిరోధకాలు మరియు బామ్స్ అందుబాటులో ఉన్నాయి. దోమలను నియంత్రించడానికి,మీరు కేవలం మీ పెరటిలో వేప మొక్కను వేయ వచ్చు. వేప ఆకులను మండించు ట లేదా కిరోసిన్ దీపాలు లేదా క్రిమిసంహారిక తైలము మంటలకు వేప నూనెను జోడించవచ్చు. మీ చర్మం పై వేప నూనెను రాసుకుంటే దోమలు దూరంగా పోతాయి. వేప మొక్కలో సహజ దోమల నివారిణి లక్షణాలు మరియు మలేరియా మీద వ్యతిరేకంగా పోరాడటానికి చాలా ప్రభావవంతమైనది.

లావెండర్ దోమల నివారణకు ఒక అద్భుతమైన మొక్క. లావెండర్ మొక్క ను అతి తక్కువ రక్షణతో సులభంగా పెంచవచ్చు. ఇది 4 అడుగుల ఎత్తు పెరుగు తుంది. అలాగే వేడి వాతావరణం అవ సరం. ఉచిత దోమల ావణం చే యడానికి,నీటిలో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ వేసి చర్మానికి రా సుకోవాలి. దోమలను నియంత్రిం చడానికి,సీటింగ్ ప్రాంతాల్లో లా వెండర్ మొక్కల కుండలను ఉంచం డి. దోమలు దగ్గరకు రాకుండా ఉండ టానికి మెడ,మణికట్లు మరియు చీలమండల వంటి ప్రాంతాలలో లవెందర్ ఆయిల్ దరఖాస్తు చేసుకోవచ్చు.



తులసి మొక్క కూడా దోమల ని వారిణి మొక్క. తులసిని నలపకుండానే మంచి వాసన వచ్చే మూలికల లోఒకటి. దోమలను నియంత్రించటానికి మీ పెరటిలో తులసి మొక్కను పెంచండి. దోమలు దగ్గరకు రాకుండా తులసి ఆకులను పేస్ట్ చేసి చర్మా నికి రాయండి. తులసిని ఆహారంలో వాసన కోసం వాడతారు. మీరు దోమలను నియంత్రించటానికి సిన్నమో న్ తులసి,నిమ్మ తులసి మరి యు పెరువియన్ తులసి వంటివి బలమైన వాసన కలిగి ఉత్తమంగా పనిచేస్తాయి నిమ్మ ఔషధతైలం కూడా దోమలను దగ్గరకు రాకుండా చేస్తుంది. నిమ్మ ఔషధతైలం మొక్క వేగంగా పెరుగుతుంది. ఇది గదిలో బాగా వ్యాప్తి చెందుతుంది. నిమ్మ ఔషధతైలం ఆకులలో సిత్రోనేల్లాల్ మిశ్రమాలు సమృద్ధిగా ఉంటాయి. సిత్రోనేల్లాల్ మిశ్రమాన్ని కమర్షియల్స్ దోమల నివారిణిలో ఉపయోగిస్తారు. 38 శాతం సిత్రోనేల్లాల్ కలిగిన అనేక రకాల నిమ్మ ఔషధతైలం మొక్కలు ఉన్నాయి. దోమల నియంత్రణకు మీ పెరటిలో నిమ్మ ఔషధతైలం మొక్కను పెంచండి. దోమలు దగ్గరకు రాకుండా ఉండాలంటే నిమ్మ ఔషధతైలం మొక్క ఆకుల చూర్ణంను చర్మం పై రాసుకోవాలి.







# నేడే ఎన్నికల సమరం

**మొదటి పేజీ తరువాయి** నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు కలుగకుండా పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నామన్నారు. కావున ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆయన సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి సందేహాలు తలెత్తినా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన హ్యాండ్‌బుక్కు చదవాలని చెప్పారు. పోలింగ్ సిబ్బంది సమిష్టిగా పనిచేయడం ద్వారానే జిల్లాలో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముగించగలమని చెప్పారు.

**సహేతుకత చూపనివారు సస్పెన్షన్**


పోలింగ్ విధులు కేటాయించిన తరువాత ఏమైనా అనారోగ్య సమస్యలు, ఇతర సహేతుక కారణాల వలన విధులు నిర్వహించలేని పరిస్థితి ఉంటే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉన్నప్పటికీ కొందరు గైరుహాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు శ్రీలేఖ, రాహుల్ మీనా, నాగజ్యోతి, ఏ.ఆర్.ఓ.లు ఇతర అధికారులు ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణకు బయలుదేరిన యంత్రాంగం







బాపట్ల మేజర్‌న్యూస్: పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సమర్థంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు.బాపట్ల హైస్కూల్ లో ఏర్పాటుచేసిన బాపట్ల అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన పోలింగ్ యంత్రాలు, సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం పరిశీలించారు. తదుపరి చీరాలలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన చీరాల నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల లోని స్ట్రాంగ్ రూములు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులు కల్పించామని, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఎన్నికలలో ముఖ్యమైన ఘట్టంలోకి వెళ్తున్న అంశాన్ని ఉద్యోగులంతా గుర్తించి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రీపోలింగ్ జరగకుండా అధికారులు చూడాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా ఉంటుందన్నారు. పార్ల మెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ యంత్రాలు ఉంటున్నా యనే విషయాన్ని పోలింగ్ సిబ్బంది గుర్తుంచుకోవా లన్నారు. ఓటింగ్ సరళని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పరిస్థితులపై దస్త్రాల్లో నిక్షిప్తం చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిష్పక్షపాతంగా పని చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గం ఆర్ఓ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఓటింగ్



ప్రారంభానికి ముందుగానే విధిగా మాక్ పోల్ జరపాల న్నారు. పోలింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. 13వ తేదీన ఉదయం ఏడు నుంచి సాయంత్రం అరుగంటల వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. ఆయన వెంట చీరాల ఆర్ఓ జి.సూర్య నారాయణరెడ్డి, మున్సి పల్ కమిషనర్ శ్రీకాంత్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఒంగోలులో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడండి

**జిల్లా ఎస్పీకి బాలినేని శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి**

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లా ఎస్పీ సుమిత్ సునీల్‌కు వినతి ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో బాలినేని మాట్లాడుతూ ఒంగోలులో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా నిత్యం



పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. టిడిపి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తుందన్నారు.

తాము కూడా దీనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజా క్షేత్రంలో మన రాజకీయ భవితవ్యాన్ని తేల్చు కోవాలన్నారు. అంతే కాని అడ్డదారుల్లో అల్లర్లు సృష్టిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని బాలినేని పేర్కొన్నారు.

# గొట్టిపాటి సమక్షంలో వైసీపీ నుండి టిడిపిలోకి చేరికలు



పంగులూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ద్వారానే సాధ్యమని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీని వీడి పలువురు టిడిపిలోకి వస్తున్నారని అద్దంకి ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జె పంగులూరు మండలం కోటపాడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాలు వైసిపిని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. ముప్పవరం తెలుగుదేశం పార్టీ ఆఫీసులో వారందరికీ పార్టీ కండువా కప్పి గొట్టిపాటి రవికుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన సభ్యులు మాట్లాడుతూ అత్యధిక మెజారిటీతో గొట్టిపాటి రవికుమార్ ను గెలిపిస్తామని తెలిపారు.

# ఘనంగా నర్సుల దినోత్సవం




చీమకుర్తి, మేజర్‌న్యూస్: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఆదివారం నర్సింగ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ వేణు గోపాల్ రెడ్డి, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ బలరాం హెడ్ నర్స్ విజయలక్ష్మి హాజరై నూర్సెస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖంపై మచ్చలు పోవాలంటే..?

# వారానికి ఓసారైనా ఆవిరిపట్టండి



ముఖంపై గల మచ్చలు తొలగిపోవాలంటే వారానికి రెండు సార్లు ముఖానికి ఆవిరి పట్టాలి. వస్తున్నది వేసవి కాలం కావడంతో ఎండలో తిరగడం ద్వారా చర్మం కమిలిపోతుంది. అలాంటప్పుడు చర్మం నిర్జీవంగా మారుతుంది. అందుకే ఏదైనా క్రీమ్‌ను ముఖానికి రాసుకుని మ ృదువుగా మర్దన చేసుకుని ఆవిరిపడితే చర్మం నిగారింపును సంతరించుకుంటుంది. చర్మానికి తేమనిస్తుంది.

శరీరంలోని వ్యర్థాలను తొలగించుకోవాలంటే.. ఆవిరి స్నానానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుబాటులో లేనప్పుడు కనీసం ముఖానికైనా ఆవిరి పడితే మేలు. అయితే నీరు మరీ వేడిగా మసలుతున్నప్పుడు ఎక్కువ సమయం ఆవిరి పట్టకూడదు. అలా చేస్తే చర్మం ఎర్రగా కందిపోతోంది. ముఖం మీద విపరీతంగా మొటిమలున్నవారు ఆవిరికి దూరంగా ఉండటం మంచిది. ఆవిరి పట్టడం ద్వారా ముఖ చర్మంలో రక్తకణాలు ఉత్తేజితమవుతాయి. రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. చర్మ కణజాలానికి సరిపడా ప్రాణవాయువు అందుతుంది.

## భోగిరి ప్రసాద్ కు నివాళులర్పించిన నరేంద్ర వర్మ



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్ : స్టూవర్టుపురం గ్రామానికి చెందిన సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకులు భోగిరి ప్రసాద్ అనారోగ్యం తో మృతి చెందగా ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు బాపట్ల నియోజకవర్గ టిడిపి, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ రాజు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వారి మరణం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు, తెలుగుదేశం పార్టీ, ఓ మంచి నాయకుడిని కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.

## రెహమాన్ మిశ్రా ను సన్మానించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు



బాపట్ల,మేజర్‌న్యూస్: బాపట్లలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎన్నికల ఏపీ రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా ఆదివారం బాపట్లకు చేరుకున్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్నికల పోలీస్ పరిశీలకులు కెప్టెన్ అయ్యప్ప, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులకు జిల్లా కలెక్టర్ నివేదిక అందించారు.ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు.సమర్థ్ మొబైల్ యాప్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్.యాప్ లోని ఎస్ ఓ ఎస్ బటన్ ప్రెస్ చేస్తే పోలీస్ అదికారులు ఆ ప్రదేశానికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందనే విషయం పై ప్రత్యేకంగా డెమో వీక్షించిన జిల్లా ఎస్పీ.సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియ నేడు జరగనున్న నేపథ్యంలో, నిన్న ఈవీఎం బాక్స్ లకు, పోలింగ్ సిబ్బందికి రూట్ మొబైల్ పార్టీలు ఎస్కార్ట్ నిర్వహిస్తూ వారి వారి పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చినారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సమర్థ్ మొబైల్ యాప్ ద్వారా స్వయంగా పరిశీలించారు.

# భట్టిప్రోలు లో ఎన్నికల రిసెప్షన్ కౌంటర్ వద్ద సిబ్బంది





భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: వేమూరు నియోజకవర్గ పరిధిలో సోమవారం జరగనున్న ఎన్నికల నిమిత్తం నియోజకవర్గానికి సంబంధించి రిసెప్షన్ కౌంటర్ మండల కేంద్రమైన భట్టిప్రోలునందలి విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.ఆదివారంఉదయం నుండి రిసెప్షన్ కౌంటర్ వద్ద పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.నియోజకవర్గ ఎన్నికల అధికార సూచనల మేర ఆయా ప్రాంతాల పోలింగ్ బూతులలో పాల్గొనే సిబ్బందికి ఈవీఎం బాక్సులు,వివి ప్లాట్ బాక్సులు,తదితర సామాగ్రిని అధికారులు అందించారు.ఎన్నికల సామాగ్రిని తీసుకున్న సిబ్బంది ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులలో ఆయా ప్రాంతాలకు తరలి వెళ్లారు.ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విశ్వ శాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సిబ్బందితో సందడి నెలకొంది.ఈ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ, వేమూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పసుపులేటి రామకృష్ణ,భట్టిప్రోలు, వేమూరు,అమృతలూరు, కొల్లూరు,చుండూరు ఎస్ఐలు కాసుల శ్రీనివాసరావు,ఎస్ రాజశేఖర్,నవీన్,షేక్ మొహమ్మద్ రఫీ,ఎస్వీ రవీంద్రారెడ్డి వారి,వారి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# ఇసుక ట్రాక్టర్ బోల్తా ఘటనలో వ్యక్తి మృతి





భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: ఇసుక ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని చింతమోటు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది.చింతమోటు సమీపంలోని కృష్ణా నదిలో ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి గాడిలో పడటంతో ట్రాక్టర్ బోల్తా కొట్టింది.ఈ సంఘటనలో చింతమోటు మధ్య గూడెం కు చెందిన డ్రైవర్ దున్నా నాని(35) ట్రాక్టర్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి దున్న ఆదాం ఇచ్చిన రిపోర్టు మేర భట్టిప్రోలు ఎస్సై కాసుల శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వచ్చి వివరాలను సేకరించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కుమ్మర కుటుంబంపై దాడి అమానుసం

- **పోస్టల్ బ్యాలెట్ ఇవ్వలేదన్న నెపంతో ఇంటిపై దాడి చేయడం సరికాదు**
- **మీడియా సమావేశంలో గురజాల శ్రీనివాసులు ప్రజాపతి**




పామూరు, మేజర్ న్యూస్: కుమ్మర సామాజిక వర్గానికి చెందిన సచివాలయ ఉద్యోగి అధికార వైసీపీ నాయకులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వలేదని ఇంటిపై దాడి చేయడం అమానుషం అని శ్రీ కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షులు గురజాల శ్రీనివాసులు ప్రజాపతి అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాల శ్రీనివాసులు ప్రజాపతి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని భీమవరం గ్రామంలో నివాసం ఉంటున్న కుమ్మర సామాజిక వర్గానికి చెందిన సచివాలయ ఉద్యోగి కిరణ్ పోస్టల్ బ్యాలెట్ ఇవ్వలేదని నెపంతో ఇంటి పై వైసిపి గూండాలు దాడి చేసి ఆస్తి నష్టం చేకూర్చడం పిరికి పంద చర్య అన్నారు. చంద్రన్న పాలన వస్తుందనే నెపంతో జీర్ణించుకోలేక ఇటువంటి చర్యలకు దిగడం సరికాదన్నారు. తక్షణమే కిరణ్ ఇంటిపై దాడి చేసిన వైసిపి గుండాలచర్యలు తీసుకోవాలన్నారు.

# ఆది శంకరాచార్యుల వారి జయంతి వేడుకలు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: ఆదిశంకరాచార్యులు వారి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని సాధనమండలి బ్రహ్మ విద్యాశ్రమం నందు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుండి ఆదిశంకరాచార్యుల వారికి అర్చన మరియు పారాయణ మరియు సత్సంగము నిర్వహించి నట్లు సాధన మండలి బ్రహ్మవిద్యాశ్రమం అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగద్గురువు శంకరాచార్యులు వారు అద్వైత సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారని అంతేకాక అనేక అష్టకాలను, భగవద్గీతకు మరియు ఉపనిషత్తులకు మరియు బ్రహ్మసూత్రాలకు భాష్యము అందించిన మహానుభావులన్నారు.సాక్షాత్ పరమేశ్వరుని అంశమైన నాలుగు శక్తి పీఠాలను నాలుగు దిక్కులలో ఏర్పరచిన మహనీయుడు ఆదిశంకరాచార్యులని అరుణ కుమారి తెలిపారు.జీవబ్రహ్మైక్య స్థితిని అత్యద్భుతంగా మానవాళికి అందించి.జీవుడే దేవుడని ఇలా ఎన్నో వేదాంత రహస్యాన్ని మానవుడు తరించడానికి ప్రబోధం చేశాడని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోట యశోద, పులికొండ దేవసేన ఆండాలు,బూర్లె రాజరాజేశ్వరి,మానేపల్లి శశికళ, బూర్లె హేమ పద్మ,దరిశి శశికళ,తదితర మహిళలు పాల్గొన్నారు.

# ఎన్నికలలో ఎవరు గెలిచినా మంత్రి పదవే





టంగుటూరు, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికలలో భాగంగాఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థులకుసోమవారం ఉదయంఏడు గంటల నుండిసాయంత్రం 6 గంటల వరకుపోలింగ్ జరుగునున్నది. పోలింగ్ కు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తగిన ఏర్పాట్లను చేశారు. మండలంలోపోలింగ్ రోజునఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా భద్రతా చర్యలను చేపట్టారు. టంగుటూరు మండలంలో 18 గ్రామాలలోన ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కొండపి ఎస్సీ నియోజకవర్గంలో ప్రధానంగా వైకాపా, టిడిపి కూటమి మధ్యనే ప్రధానంగా తీవ్ర పోటీ నెలకొంది. కొండేపి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ వైకాపా ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. టిడిపి కూటమి కొండేపి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామిపోటీ చేస్తున్నారు. ఒంగోలు పార్లమెంట్ టిడిపి ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసుల రెడ్డి పోటీ చేస్తున్నారు. కొండేపి ఎస్సీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి నాలుగవసారి పోటీ చేస్తున్నారు. గత రెండుసార్లు కొండేపి ఎస్సీ నియోజకవర్గంలో డాక్టర్ డోల బాల వీరేంజనేయ స్వామి విజయకేతరం ఎగురవేశారు. మూడవసారి మరొకసారి కొండేపి ఎమ్మెల్యేగా గెలిచి హాట్రిక్ కొట్టాలని ఎమ్మెల్యే స్వామి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు. స్వామి ఎమ్మెల్యేగా గెలిచి టిడిపి అధికారంలోకి వస్తే స్వామికి మంత్రి పదవి ఖాయమని టిడిపి వర్గాలు అభిప్రాయపడుతున్నారు. కొండేపి వైకాప ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మంత్రి ఆది మూలపు సురేష్ గతంలో సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం ఎస్సీ నియోజకవర్గాలలో ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారిగా కొండేపి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం జగన్ ఆదేశాలతో మంత్రి ఆదిమూలపు సురేష్ పోటీ చేస్తున్నారు. మంత్రి సురేష్ ఎమ్మెల్యేగా గెలిచి వైకాపా అధికారంలోకి వస్తే తిరిగి మంత్రి సురేష్ మంత్రి పదవి దక్కించుకునే అవకాశం ఉంది. మంత్రి సురేష్ తన ఉన్న సమయంలో నియోజకవర్గంలో ప్రచారాన్ని ఉదృతం చేశారు. ఇలా ఉండగాకొండేపి వైకాపా సమన్వయకర్తగా పనిచేసిన వరికూటి అశోక్ బాబు తొలిసారిగా బాపట్ల జిల్లా వేమూరు ఎస్సీ నియోజకవర్గ నుండి సీఎం జగన్ ఆదేశాల మేరకువైకాపా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. అశోక బాబు విజయంపై ఆయన అనుచరులు, అభిమానులుతీవ్ర ఉత్కంఠతో ఎదురు చూడటం విశేషం.

# ఓటు వేస్తే ఉచిత వైద్య పరీక్షలు



చీరాల, మేజర్ న్యూస్: భారత రాజ్యాంగం మనకు కల్పించిన ఓటును వేసిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని శ్రీకామాక్షి కేర్ హాస్పటల్ అధినేత తాడివలస దేవరాజు అన్నారు. ఒక ప్రకటనలో ఆదివారం తాడివలస దేవరాజు వివరాలు తెలుపుతూ ఓటు వేయడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. చీరాల, పర్చూరు, బాపట్ల నియోజకవర్గాలలో ఓటు శాతం పెంచడానికి సామాజిక బాధ్యతగా ఓటర్లకు ఓ మంచి అవకాశం కల్పించామని దేవరాజు అన్నారు. ఓటు వేసిన వచ్చిన వారికి ఉచితంగా మా హాస్పటల్ శ్రీకామాక్షి కేర్ హాస్పటల్‌లో ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తామని తాడివలస దేవరాజు అన్నారు. ఓటు వేసి వచ్చి సిరా మార్కు చూపించిన వారికి ఈ అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

# కారు ఢీ కొనడంతో ఇద్దరు చిన్నారులు మృతి





చిన్నగంజాం(చీరాల రూరల్), మేజర్ న్యూస్: బైక్‌ను కారు ఢీ కొనడంతో ఇద్దరు చిన్నారులు దుర్మరణం పొందారు. ఈ దుర్ఘటన ఆదివారం చినగంజాం రొంపేరు కాలువ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాపట్ల పట్టణం 6వ వార్డుకు చెందిన దేవి సంధ్య(11), జస్విత(7)లు తండ్రితో కలిసి ఉప్పుగుండూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో చిన్నగంజాం సమీపంలోని రొంపేరు వాగు వద్ద బాలికలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మృత దేహాలను శవపరీక్ష నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# గ్రోత్ సెంటర్లో భారీగా బియ్యం స్వాధీనం

### - అర్ధరాత్రి దాడి చేసి పట్టుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్

### - 2778 బియ్యం బస్తాలు స్వాధీనం

మద్దిపాడు, మేజర్‌న్యూస్: ఈనెల 13న ఎన్నికలు జరగనుండగా భారీ మొత్తంలో బియ్యం పట్టుబడటం సంచలనం రేపింది. మండల పరిధిలోని గ్రోత్ సెంటర్లో తెల్లవారుజామున ఓ రైస్ మిల్లు పై ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడి చేసి మూడు లారీలను అదుపులోకి తీసుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 2778 బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 35 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా, ఒంగోలులోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో బియ్యం పంపిణీ చేస్తుండగా అధికారులు రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా గ్రోత్ సెంటర్‌లో గల శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో లోడింగ్ జరుగుతుందన్న సమాచారం మేరకు (ఎలక్షన్) అసిస్టెంట్ కలెక్టర్ సార్యమన్ పటేల్ తన సిబ్బందితో దాడి చేసి మూడు లారీలను, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్ యజమాని మట్ట శ్రీహర్షపై కేసు నమోదు చేసి ఫ్యాక్టరీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.





# శ్రీనారాయణస్వామి దేవస్థానంలో విశేషపూజలు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీమిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం నందు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామివారికి దేవస్థానం అర్చకులు యం.సత్యనారాయణశర్మ, యం.ప్రసాదుశర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం పూజలు నిర్వహించి అనంతరం స్వామివారిని



దేవతామూర్తులను పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరణచేసి పూజలను నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆవరణలో గోమాతను పూజించి గోపూజా కార్యక్రమం మహానైవేద్యం కార్యక్రమం నిర్వహించి తదుపరి దేవస్థానం వారి ఆధ్వర్యంలో భక్తులకు భోజనవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, సి.వెంకటరావు, మామిడేల వెంకటేశ్వర్లు, వాకా ఆదినారాయణ, టియల్ నారాయణ, జిలకర నారాయణ మాలకొండయ్య బ్రదర్స్, కండక్టర్ మధు, పలువురు భక్తులు, అర్చకబృందం, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# సార్వత్రిక సమరానికి సర్వం సిద్ధం

- 298 పోలింగ్ కేంద్రాలు, 244057 మంది ఓటర్లు, 1788 మంది సిబ్బంది.
- భారీ పోలీసు బందోబస్తు.. 34 సెక్టార్లుగా విభజన..





అద్దంకి, మేజర్ న్యూస్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అద్దంకి నియోజకవర్గంలో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. చీరాల డీఎస్పీ బి ప్రసాద్ పర్యవేక్షణలో అద్దంకి సీఐ పి. కృష్ణయ్య, ఇతర పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 298 పోలింగ్ బూత్లకు గాను 244057 మంది ఓటర్లు.తమ ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. ఇందులో 119570 మంది పురుషులు, 124475 మంది మహిళలు, 12 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు.వీరందరూ పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చి ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. అద్దంకిప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం వద్ద భారీషామియానాలు ఏర్పాటు చేశారు. బాపట్ల పార్లమెంటు పరిధిలోని మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోపని చేస్తున్న ఉద్యోగులను పీవోలు, ఏపీవోలు, ఓపీవోలుగా నియమించి వారికి పోలింగ్ సామాగ్రిని అందించారు. పోలీసు బందోబస్తు నడుమ సిబ్బందిని 34 సెక్టార్లుగా విభజించారు.

ప్రత్యేక వాహనాల్లో వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సరైన రవాణా సదుపాయాలు లేకపోవటంతో ఎన్నికల సిబ్బంది.విధులకు హాజరు కావటానికి ఆలస్యమైంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు దూర ప్రాంతాల నుంచి సిబ్బంది వస్తూనే ఉన్నారు. బలమైన కారణంలేకుండా గైర్హాజరు అయిన వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుంటారని ఎన్నికల అధికారులు వివరించారు.

# ఘనంగా నర్సుల దినోత్సవం

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఆదివారం ఫ్లోరెన్స్ నైటింగేల్ 204వ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరిగిందని అందులో భాగంగా ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పి.పి.యూనిట్ నందు నర్సులకు అభినందిన సభ జరిపామని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) ప్రకాశం జిల్లా కమిటి కార్యదర్శి కమ్మ శ్రీధర్ బాబు తెలియజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్టింగ్ చేసి నర్సులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997 నుండి వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా రాజీ లేని పోరాటాలు చేసిందనీ ఫలితంగా ఎన్నో హక్కులు సాధించు కున్నామని గుర్తు చేశారు. కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయ్యినారనీ మిగిలి ఉన్న వారిని కూడా త్వరలో రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే స్టాఫ్ నర్సులు, ఎ.ఎన్.ఎంలు, కమ్యూనిటి ఆరోగ్య అధికారులు అంకిత భావంతో రోగులకు సేవలు అందిస్తున్నారని సిబ్బంది కొరత, ఆన్లైన్ యాప్‌ల వలన పనిభారం పెరిగిందని అన్నారు. జిల్లా కమిటి అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య ఉద్యోగులు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవచ్చుని, యూనియన్ సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసిన అధికారులు

పొదిలి, మేజర్‌న్యూస్: సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వ సిద్ధం చేశారు, ఆదివారం సాయంత్రం 5 గంటలకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్లతో పాటు, పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు, పోలింగ్ శాఖ అధికారులు పోలింగ్ సిబ్బందికి అన్ని





ఏర్పాట్లు చేశారు.విశ్వనాథపురం లోని ప్రభుత్వ పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం, ఆర్డబ్ల్యూఎస్ సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రకాష్ నగర్, పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, తాసిల్దార్ కార్యాలయం పక్కన గల జిల్లా పరిషత్ పాఠశాల, కాటూరి వారి పాలెం ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర ప్రత్యేక బలగాలు చేరుకున్నాయి. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

## - ఆర్వో ఆరవకుమార్

కొండపి, మేజర్‌న్యూస్: నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక ఎన్నికలో భాగంగా కొండపి నియోజకవర్గంలో జరగనున్న ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్వో ఆరవకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గంలోని 283 నియోజకవర్గాలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మొత్తం 283 పివోలు, ఏపివోలతో పాటు, ఓ.పి.వోలు భద్రత సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా, ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించు కోవాలని సూచించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎవరైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# కె.ఉప్పలపాడులో ఆదిశంకరచార్య జయంతి వేడుకలు

కొండపి, మేజర్‌న్యూస్: జగత్ గురు ఆది శంకరచార్యుల జయంతి వేడుకలు మండలంలోని కె.ఉప్పలపాడులో ఆగస్త్యేశ్వరాలయంలో అర్చకులు రాఘవేంద్ర శర్మ నిర్వహించారు. ఆదివారం ఆలయంలో శంకరచార్యుల చిత్రపటానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

# సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

దర్శి, మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గం పరిధిలో 282 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 1700 మంది పోలింగ్ సిబ్బందిని ఎన్నికల కోసం ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనియా సంఘటనలు జరగ కుండా



500 మంది పోలీస్ సిబ్బందిని ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. దీనితోపాటు మొబైల్ టీం కూడా పోలింగ్ కేంద్రాలు ను పరిశీలిస్తుందని ఆర్ఓ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# కోలన్ (ప్రేగు) క్యాన్సర్‌తో పోరాడే అద్భుత ఆహారాలు!

మీకు తెలుసా! కూరగాయలలో శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు సమృద్ధిగా వుంటాయని మరియు అవి పెద్దప్రేగు కాన్సర్ మీద ప్రభావం చూపుతాయని తాజా అధ్యయనాల ప్రకారం వెల్లడైంది.

ఆధునిక ఆహార పద్ధతి మరియు జీవనశైలి లో మార్పులు చేయడం వలన కూడా 70% పెద్దప్రేగు కాన్సర్ కేసులను నివారించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఆహారాల పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వలన ఈ వ్యాధి నుండి మిమ్మల్ని రక్షించుకోగలుగుతారు. మరి అవేంటో తెలుసుకోవడానికి మీరు సిద్ధంగా వున్నారా!


పొట్టలో క్యాన్సర్(కొలరెక్టల్ క్యాన్సర్) లక్షణాలు గుర్తించడం ఎలా...?

జీర్ణ ప్రక్రియ సరిగా జరగకపోవడం వలన మనకు కడుపు నొప్పిగా ఉంటుంది, మరియు పొట్ట బాగా ఉబ్బినట్లు లేదా అద్వానంగా ఉంటుంది. కొన్నిసార్లు, దీర్ఘకాల మలబద్ధకం కూడా కొలొరెక్టల్ క్యాన్సర్ ని అభివృద్ధి చెందే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి మీ రోజు వారీ రొటీన్లకు అదనపు పదార్థా లను జోడించ కుండా మీ శరీరం లోపల జరిగే విషయాలను తెలు సు కోవాలి. దీనికోసం మీరు చేయగలిగే ఒకే ఒక ఉత్తమ మైన మార్గం పెద్దప్రేగు క్యాన్సర్‌తో పోరాడ టంలో సహాయపడే ఆహార పదార్థాలను తీసు కోవడమే.









## ప్రాణాంతక కోలన్ క్యాన్సర్‌ను నివారించే నేచురల్ మార్గాలు..

ప్రత్యేకమైన పోషకాలతో సమృద్ధిగా ఉండే కొన్ని ఆహార పదార్థాలను తీసుకోవడం వలన మరియు ఈ వ్యాధికి వ్యతిరేకంగా పోరాడటంలో సహాయం పడుతాయి. ఈ విషయాలు మీకు సులభంగా అర్థం అవడానికి, మేము కొలోన్ క్యాన్సర్తో పోరాడే కొన్ని ఉత్తమమైన ఆహార పదార్థాలను జాబితా ని తయారు చేశాము. సహజంగా పెద్దప్రేగు కాన్సర్తో పోరాడడం ఎలాగో తెలుసుకోవడానికి చదవడం కొనసాగించండి.

### 1. బ్రౌన్ రైస్:

బ్రౌన్ రైస్ లో కాన్సర్ కణాల పెరుగుదలని అడ్డుకునే చైన్-కొవ్వు ఆమ్లాలు ఈ బ్రౌన్ రైస్ లో ఉన్న ఫైబర్లో అధికంగా ఉంటుంది.సాధారణమైన రైస్ తో పోలిస్తే బ్రౌన్ రైస్ 3.5 గ్రాముల ఫైబర్ ని అధికంగా కలిగి ఉంటుంది.

### 2. సాల్మన్:

విటమిన్ ఈ లోపం వలన పెద్దప్రేగు క్యాన్సర్ కి దోహదం చేస్తుంది. మూడు ఔన్సుల సాల్మన్ 112% విటమిన్ డి కలిగివుంది మరియు ఇది మీ రోజువారీ డైట్ లో చేర్చుకోవడం మంచిది. ఇది పెద్దప్రేగు కాన్సర్తో పోరాడే టాప్ ఆహారాలలో ఒకటి గా వుంది.

### 3. బట్టీడ్ కార్న్:

అయోసిటాల్ హెక్సాఫాస్ఫేట్ అని పిలువబడే మొక్కజొన్న ఫైబర్ సమ్మేళనం పెద్దప్రేగు కాన్సర్ పెరుగుదలను నిరోధిస్తుంది. మీరు తగిన క్యాన్సర్-పోరాట సంయోజిత లినోలెసిక్ ఆమ్లం లాభాలను పొందడానికి ఎక్స్ట్రా బట్టర్ ని ఆడ్ చేసుకోవచ్చు.





### 4. వేరుశెనగలు:

వేరుశెనగలను మూడు సార్లు వారానికి తీసుకుంటే కొలన్ పాలిప్స్ ప్రమాదం 33% తగ్గుతుంది. అంతేకాక, సగం కప్పు వేరుశెనగల లో 6 గ్రాముల ఫైబర్ కలిగి ఉంటుంది. అందువలన, వేరుశెనగలు సహజంగానే పెద్దప్రేగు కాన్సర్తో పోరాడడానికి మీకు సహాయం చేస్తాయి.

### 5. అల్లం:

28 రోజుల పాటు అల్లం రూట్ సప్లిమెంట్సు తీసుకోవడం వలన 28 శాతం కొలోన్ వాపు తగ్గుతుంది అని ఒక అధ్యయనంలో వెల్లడైంది. ప్రతిరోజు 2 గ్రాముల అల్లం రూట్ లేదా తాజా అల్లం 2 స్పూన్లు తీసుకోండి. పెద్దప్రేగు క్యాన్సర్ను నివారించే టాప్ ఆహారాలలో ఇది ఒకటి.

### 6. పసుపు:

కోలన్ క్యాన్సర్ నివారించడంలో పసుపు గ్రేట్ గా సహాయపడుతుంది. ఇందులో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలను అధికంగా ఉండటం వల్ల ట్యూమర్ గ్రోత్ ను నివారిస్తుంది. డిఎన్ ఎ సెల్స్ డ్యామేజ్ కాకుండా క్యాన్సేరియస్ సెల్స్ ను న్యూట్రలైజ్ చేస్తుంది. డ్యామేజ్ అయిన సెల్స్ ను రిపేర్ చేస్తుంది. కాబట్టి రెగ్యులర్ డైట్ లో ఎక్కువగా పసుపు వాడకాన్ని పెంచాలి.



### 7. ఉల్లి, వెల్లుల్లి:

వెల్లుల్లిలో ఉండే సల్ఫైడ్స్ క్యార్సినోజెన్స్ ను క్లియర్ చేస్తుంది. దాంతో క్యాన్సర్ సెల్స్ ను తొలగిస్తుంది. రోజుకు ఒకటి, రెండు వెల్లుల్లి రెబ్బలను వారం పాటు తినడం వల్ల కోలన్ క్యాన్సర్ ను 32 శాతం తగ్గించుకోవచ్చు. ఉల్లిపాయలను తినడం వల్ల కూడా కోలన్ క్యాన్సర్ ను 30 నుండి 50 శాతం వరకూ తగ్గించుకోవచ్చని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.



### 8.వైట్ టీ వైట్‌టీలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి.

ఇది క్యాన్సర్ సెల్స్ ను నాశనం చేయడంలో అద్భుతంగా సహాయపడుతాయి. గ్రీన్ టీలో కంటే వైట్ టీలో యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి, మీ రెగ్యులర్ డైట్ లో వైట్ టీని తీసుకోవడం వల్ల చాలా డిఫరెన్స్ ను మీరు చూడవచ్చు.

### 9.ఫ్లాక్స్ సీడ్స్:

ఫ్లాక్సీడ్స్ ల ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ , యాంటీ ఆక్సిడెంట్స్ మరియు నేచురల్ ఫైబర్ అధికంగా ఉంటు ంది. అందువల్ల వీటిని రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం ఒక ఉత్తమ మార్గం. ఫ్లాక్ సీడ్స్ నీటిని గ్రహించి కోలన్ ను విస్తృత పరుస్తుంది. దాంతో టాక్సిన్ మరియు మ్యూకస్ ను శరీరం నుండి బయటకు నెట్టేస్తుంది. దాంతో పాటు, క్యాన్సర్, గుండె జబ్బులను మరియు డయాబెటిస్ ను నివారిస్తుంది.

### 10. ఆకుకూరలు మీ డైలీ డైట్ లో ఆకు కూరలు లేదా పచ్చి కూరగాయలకు ఎక్కువ ప్రాదాన్యత ఇవ్వాలి

ఆకుకూరల్లో అధిక శాతంలో న్యూట్రీషియన్ విలువలు కలిగి ఉంటాయి. ఆకు కూరల్లోని బీటా కెరోటిన్ క్యాన్సర్ సెల్స్ తో పోరాడటానికి సహాయపడుతాయి. మరియు క్యాన్సర్ సెల్స్ అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటాయి.

APPSC, TSPSC GROUP-2 Exams

# శాతవాహనుల పరిపాలన

(ఎపిపిఎస్‌సి సిలబస్‌లో శాతవాహనుల పరిపాలన అనేది స్పష్టంగాను మరియు ముఖ్య పాఠ్యాంశంగా ఉంది. టిఎస్‌పిఎస్‌సి సిలబస్‌లో కూడా శాతవాహనుల పాఠ్యాంశం ముఖ్యమైనది. కనుక ఈ పాఠ్యాంశం పోటీ పరీక్షల దృష్ట్యా చాలా విలువైనది. ఇపుడు చదవడం ఆరంభిద్దాం!)

**శ్రీముఖుడిచే స్థాపించబడిన శాతవాహన సామ్రాజ్యం సుమారు 450 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. వీరికున్న సువిశాల సామ్రాజ్యం అనేక యుద్ధాలు-సంధుల ప్రతిఫలంగా లభించింది. ఆంధ్ర శాతవాహనులు తమ శత్రువులైన శకులు, యవనులు, పల్లవులు మొదలైన వారితో అవిశ్రాంతంగా పోరాడి సుస్థిర రాజ్యాన్ని నెలకొల్పారు. వీరి సామ్రాజ్యంలోని ప్రజలు చాలా కాలం సుఖసంతోషాలతో జీవనం సాగించారు. విదేశీయులతో సముద్ర వ్యాపారం చేయడం వల్లనే శాతవాహనులు సిరిసంపదలతో తులతూగారు.**

**వర్ణాశ్రమ ధర్మాల రక్షణ**

శాతవాహనులు బ్రాహ్మణులు కనుక చాలా వరకు వీరి పాలనలో బ్రాహ్మణత్వం తొంగిచూసింది. సాధారణంగా అయితే ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణ రాజు విధి. కానీ శాతవాహన రాజు ప్రధాన విధి వర్ణాశ్రమ ధర్మాల రక్షణ. శకుల బారినుండి తమ బ్రాహ్మణ వర్గాన్ని రక్షించుకోవటానికి శాతవాహనులు కఠిన నియమనిబంధనలు రూపొందించుకున్నారు. ఏక బ్రాహ్మణ అనే బిరుదులు సైతం ధరించారు.

**అర్థశాస్త్రం, మనుధర్మశాస్త్రాల దిశా నిర్దేశనం**

శాతవాహనుల పాలనకు మార్గదర్శకులు మౌర్యులు. ఎందుకంటే శాతవాహనులు తొలుత మౌర్యులకు సామంతులుగా జీవితాన్ని ప్రారంభించారు. శాతవాహనులు పాలనకు దిశా నిర్దేశనం చేయడానికి అప్పటికే ప్రాచుర్యం పొందిన గ్రంథాలు రెండు ఉన్నాయి. ఒకటి కౌటిల్యుడి అర్థశాస్త్రం కాగా, రెండోది మనువు మనుధర్మశాస్త్రం. కౌటిల్యుడి అర్థశాస్త్రం గ్రంథాన్ని పాలనకు ఉపయోగించుకున్న శాతవాహనులు మనువు మనుధర్మశాస్త్రాన్ని సామాజిక వ్యవస్థ నడపడానికి వినియోగించారు.

**రాజ్యాధికారం వారసత్వం ...ఆదర్శ విధానం..**

సమకాలీన ఉత్తర భారతపాలనలో రాజుకి లభించే అధికారం దైవదత్తం అని పేర్కొనగా, శాతవాహన రాజులలో ఏ ఒక్కరూ రాజ్యం తమకు దైవదత్తం అని ప్రకటించలేదు. అలానే రాజ్యాధికారం కోసం వారసత్వ కలహాలు, అంతర్యుద్ధాలు అసలే జరగలేదు. రాజ్యం వారసత్వంగా పెద్దకుమారుడికి సంక్రమించేది. ఎంత లేదన్నా రాజు బిరుదులు ధరించడానికి మాత్రం ఆసక్తి చూపేవాడు. గౌతమీపుత్ర శాతకర్ణికి చెందిన శాసనాలలో రాజరాజు అని ఉంది. వాస్తవానికి 'రాజా' పేరిట బిరుదులు ధరించడాన్ని భారతదేశంలో ప్రారంభించిన మొదటివారు కుషాణులు. వీరి ననుసరించి పశ్చిమ క్షాత్రపులు, వారిననుసరించి శాతవాహనులు రాజా బిరుదులు ధరించడం ప్రారంభించారు. శాతవాహనులది రాచరిక విధానం అయినప్పటికీ ఏ ఒక్కరాజూ ప్రజా పీడితులుగా లేరు. శాతవాహనులకు చెందిన చాలా పాలనాంశాలను ఉన్నాఘర్ శాసనం తెలుపుతుంది. ఈ శాసనం ప్రకారం రాజ్యవారసులు బాలురైనపుడు రాజ్యమాత లేదా మేనమామలు అతనికి యుక్త వయస్సు వచ్చేవరకు పరిపాలన కొనసాగిస్తారు. ఉదాహరణకు రెండో శాతకర్ణి మరణానంతరం అతని కుమారులైన వేదశ్రీ, శక్తిశ్రీలు బాలురు కావడం వల్ల తల్లి నాగనిక కొన్నాళ్ళు రాజ్యమాతగా పాలించింది.




**మత ధార్మిక విషయంలో ఆసక్తి**

శాతవాహన రాజులు మత ధార్మిక విషయంలో ఎక్కువగా ఆసక్తి చూపేవారు. సహజసిద్ధంగానే శాతవాహనులు బ్రాహ్మణులు కాబట్టి పాలనలో బ్రాహ్మణులకు ప్రాధాన్యత వచ్చింది. యజ్ఞయాగాది కృతువులు బాగా నిర్వహించేవారు. వీటికి రాజు ఆశీస్సులుండేవి. యుద్ధాల సమయంలో సైతం రాజులు ముందుండి సైన్యాన్ని నడిపేవారు. సాటి సైనికులలో మనోధైర్యం నింపేవారు. శాతవాహనుల కాలంలో సప్తాంగాల ప్రకారమే పాలన జరిగింది. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పిన సప్తాంగాల ప్రకారమే శాతవాహనులు పాలన చేసారు. వీనిలో రాజు ప్రధానమైనవాడు. ఇంకా రాజ్యం, మంత్రి, దుర్గం, కోశం, సైన్యం, మిత్రులు అనేవి సప్తాంగాలు.

(పోటీ పరీక్షల్లో సప్తాంగాలలో ఉన్నదేదీ? లేనిదేది? అని అడుగుతున్నారు.కనుక సప్తాంగాలను ఓసారి మళ్ళీ మననం చేయండి)

**మంత్రిమండలి :**

శాతవాహనుల కాలంలో మంత్రిమండలికి రాజోద్యోగులు అనిపేరు. బౌద్ధ వాఙ్మయం శాతవాహన రాజోద్యోగులపై విశేష సమాచారాన్ని అందిస్తోంది. వీరు రాజుకు సన్నిహితులుగా ఉంటూ రాజ్య వ్యవహారాల్లో సలహాలు ఇస్తూ చర్చల్లో మునిగి తేలేవారు. అలానే రాజాజ్ఞలనూ అమలు పరిచేవారు. ఇలాంటి విధులు నిర్వహించే వీరిని రాజామాత్యులు అని పిలిచారు. ఇంకా విశ్వాసామాత్యులు, మహామాత్యులు, శ్రవణ మహామాత్యులు ఉండేవారు. శ్రవణా మహామాత్యులు అనగా కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలకు పత్రాలను భద్రపరిచేవారు. తర్వాత తర్వాత వీరిని నిబంధనా కారులని, అక్షపటలికులు అని పిలిచారు. ఇపుడు మనం కొందరు మంత్రులు వారు చేసే విధులను తెలుసు కుందాం!

**మంత్రులు వారు చేసే విధులు**

1. **మహామాత్యులు**
   మహామాత్యులు అనగా ప్రత్యేక కార్యనిర్వహణ కోసం నియమితులైన మంత్రులు
2. **అమాత్యులు**
   అమాత్యులు అనగా శాతవాహనులు రాష్ట్రాలకు (ఆహారాలు) అధిపతులుగా ఉండి పాలన చేసినవారు.
3. **రాజామాత్యులు**
   రాజామాత్యులు అనగా రాజు సమక్షంలో పనిచేస్తూ రాజుకు సలహాలిచ్చే మంత్రులు.
4. **విశ్వాసామాత్యులు**
   విశ్వాసామాత్యులు అనగా చక్రవర్తికి చెందిన అధికార అనధికార రహస్యాలను కాపాడేవారు.
5. **భాండా గారికుడు**
   భాండా గారికుడు అంటే వస్తుసంచయాన్ని భద్రపరిచేవారు.
6. **హిరణ్యకుడు**
   హిరణ్యకుడు అనగా ద్రవ్యరూప ఆదాయాన్ని భద్రపరిచేవారు.
7. **మహాసేనాపతి**
   మహాసేనాపతి అనగా సైనిక వ్యవహారాలకు ప్రదాన అధికారి.

ఇప్పుడు మనం చెప్పుకున్న మంత్రులతోనూ, అధికారులతోనూ కేంద్ర సచివాలయం ఉండింది.

**రాజ్య విభజన :**

శాతవాహన సామ్రాజ్యం బలమైన కేంద్రీకృత రాచరికం కాదు. (ఈ పాయింట్ గుర్తు పెట్టుకోండి) వీరి రాజ్యం రెండు రకాలుగా విభజింపబడింది.

ఎ) ఒకటి సామంత రాజ్యాలు
బి) రెండవది సామంతరాజ్యాలకు పోనూ, మిగిలిన శాతవాహన రాజ్యం.

రాజ్యం రాష్ట్రాలుగా లేదా ఆహారాలుగా విభజింపబడింది. కోడూరుహార, సోపారహార, గోవర్ధనాహార, మెసోలియాహార అనేవి పేర్లు. ఒక్కో ఆహారంలో ఒక ప్రధాన నగరం మరియు అనేక గ్రామాలుండేవి. ఈ ఆహారాల పాలకులు అమాత్యులు. అమాత్యులనేవి వారి పదవులు వంశపారంపర్యం కాదు. నేటి సివిల్ సర్వీసు అధికారుల్లాగా వీరిని ఒక ఆహారం నుండి మరో ఆహారానికి తరచుగా బదిలీ చేస్తుండేవారు. ఆహారం మళ్ళా విషయాలుగా విభజింపబడింది. విషయపతులు వీరూ ప్రతిభ ఆధారంగానే నియమితులయ్యేవారు.

ఇక పాలనా విభాగాలలో మిక్కిలి చిన్నది గ్రామం. గ్రామం పాలనాధికారిని గ్రామిణి అన్నారు. ఒక గ్రామణి ఆధీనంలో 5నుండి 10గ్రామాల వరకు ఉండేవి. మత వ్యవహారాలు చూసే గ్రామ పాలనాధికారిని మహా ఆర్యక అన్నారు.

**నిగమాలు :**

నిగమం అంటే పట్టణాలు. శాతవాహనుల పట్టణ పాలనను నిర్వహించే సభలను నిగమ సభలు అని పిలిచారు. ఈ నిగమ సభల గురించి కుబేరుడు వేయించిన భట్టిప్రోలు పేటికా శాసనం చెపుతుంది. కేవలం ఈ శాసనం ద్వారానే శాతవాహనుల పట్టణ పాలన మనకు తెలుస్తుంది. (ఈ పాయింట్ బాగా గుర్తుంచుకోవాలి) సోపార, బరుకచ్చం, కన్హేరి, కళ్యాణి, పైఠాన్, తగర, జున్నాఘర్, కార్లే, ధనకటకం (అమరావతి) ముఖ్యమైన పట్టణాలు.

పట్టణాల పాలన చూసే నిగమసభలో కులపెద్దలయిన గహపతులు సభ్యులుగా ఉండేవారు. దాదాపు నిగమసభలు స్వతంత్ర పాలనాధికారాలు కలిగి ఉండేవి. ఒకరకంగా చెప్పాలంటే శాతవాహనుల స్తానిక పాలన స్వతంత్రమైనదే. ఈ స్వతంత్రం అనే భావనను మౌర్యుల నుండి శాతవాహనులు గ్రహించారు.

**ఎవరి తరువాత ఎవరు? (మోస్ట్ ఇంపార్టెంట్)**


శాతవాహనులు పాఠం పూర్తికాగానే మనకు ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, ఆనందగోత్రులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు కన్పిస్తారు. కాగా వీరిలో ముందు మరియు వెనకాల పాలించిన వారిని ఒక క్రోనాలాజికల్ ఆర్డర్‌లో పెట్టమని రీసెంట్ గ్రూప్-2లో ఒక ప్రశ్న వచ్చింది. కనుక వీరి కాలాలను మనం స్పష్టంగా వరుసక్రమంలో గుర్తుంచుకుందాం.

**శాతవాహనులు** - క్రీస్తుపూర్వం 225 నుండి క్రీస్తుశకం 250
**ఇక్ష్వాకులు** - క్రీస్తుశకం 230 క్రీస్తుశకం 321
**శాలంకాయనులు** - క్రీస్తుశకం 340 నుండి క్రీస్తుశకం 450
**ఆనందగోత్రులు** - క్రీస్తుశకం 300 నుండి 400
**బృహత్పలాయనులు** - క్రీస్తుశకం 300 నుండి 400 వరకు
**విష్ణుకుండినులు** - క్రీస్తుశకం 420 నుండి 600 వరకు

కనుక వీరి పాలనా వరుసక్రమాన్ని ఇలా గుర్తించాలి.

1. శాతవాహనులు, ఇక్ష్వాకులు, ఆనందగోత్రులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు (లేదా) శాతవాహనులు, ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, ఆనందగోత్రులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు.

ఇందుకు సంబంధించిన ప్రశ్న వచ్చింది. కనుక బాగా గుర్తుంచుకోండి. ఒకటికి రెండు సార్లు రాసుకొని చదవండి. ముందు తెల్లటి పేపర్ తీసుకోండి. ఓకేనా!



హిస్టరీ రఫీ సార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

**నమూనా ప్రశ్నలు**

**1) కుంతల శాతకర్ణి, అపిలకుడు, కృష్ణుడు, రెండో శాతకర్ణి మరియు యజ్ఞశ్రీ శాతకర్ణి - ఈ ఐదుగురు శాతవాహన చక్రవర్తులును వారు ఎన్ని సంవత్సరములు పాలించినారో, అత్యధిక కాలం పాలించిన రాజుల నుండి అత్యల్ప కాలం పాలించిన రాజులను అవరోహణ క్రమంలో() అమర్చండి?**

ఎ) కుంతల శాతకర్ణి, అపిలకుడు, కృష్ణుడు, రెండో శాతకర్ణి మరియు యజ్ఞశ్రీ శాతకర్ణి
బి) రెండో శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి, కృష్ణుడు, అపిలకుడు మరియు కుంతల శాతకర్ణి
సి) యజ్ఞశ్రీ శాతకర్ణి, కృష్ణుడు, కుంతల శాతకర్ణి, అపిలకుడు మరియు రెండో శాతకర్ణి
డి) అపిలకుడు, కృష్ణుడు, రెండో శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి మరియు కుంతల శాతకర్ణి (బి)

**2) ఈ క్రిందివ్యాఖ్యానాలలో సరికాని వ్యాఖ్యానాన్ని గుర్తించండి?**

ఎ) శాతవాహనులు బ్రాహ్మణులు కనుక అధికారికంగా వైదికమతాన్ని పోషించారు.
బి) శాతవాహనులు వైదికులయినప్పటికీ, జైనం, బౌద్ధం, అజీవకం మతాలు అప్పట్లో వర్ధిల్లుతున్నందున వాటినీ అనుసరించారు.
సి) శాతవాహన రాజులు వైదికంతో పాటుగా జైనం-బౌద్ధం, అజీవకంలను ప్రోత్సహించారు. ఇందుకు కారణం తమ భార్యలతో పాటు రకరకాల వృత్తులవారు ఈ మూడు మతాల పోషకులు కావటం.
డి) శాతవాహనుల జైనం-బౌద్ధ మతాలపై మౌర్యుల ప్రభావం ఉన్నది. (బి)

**3) శాతవాహనుల కాలం నాటి స్త్రీల స్థితిగతులు విషయంలో ఇది నిజం కాదు.**

1) స్త్రీలకు స్త్రీ ధనంతో పాటుగా స్వంత ఆస్తులుండేవి
2) సతీసహగమనాన్ని స్త్రీలు పాటించారు
3) అన్ని తరగతుల మహిళల్లోనూ బహుభార్యత్వం ఉంది
4) స్త్రీల పేర్లను తమ పేర్లముందు రాజులు పెట్టుకోవటం స్త్రీలకు గౌరవ మర్యాదలు ఇవ్వడానికి.

ఎ) 1 మరియు 4 (బి) 3 మరియు 4
(సి) 3 మాత్రమే (డి) 4 మరియు 2 (బి)

# నేటి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి





ఒంగోలు, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికలు సోమవారం పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతాపరంగా చర్యలు చేపట్టింది. ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించేందుకు కలెక్టరేట్లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ప్రత్యేకంగా ఎల్‌ఈడి స్క్రీన్, పెద్ద పెద్ద టివీలను అధికారులు ఏర్పాటు చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితిని అనుక్షణం ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి మీరు వీక్షిస్తారు. పరిస్థితిని కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేసేందుకు కమ్యూనికేషన్ ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 18,22,470 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,07,980 మంది, మహిళలు 9,14,379 మంది, థర్డ్ జెండర్ 111 మంది ఉన్నారు. వీరి కోసం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో 2183 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఒంగోలు లోక్ సభ, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న 165 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని వీరు తేల్చనున్నారు. మొత్తం 14,768 మంది పీ.ఓ.లు,.ఏ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో మాక్ పోలింగ్ మొదలు అన్ని కేంద్రాలలో ఓటింగ్ పూర్తయ్యే వరకు కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పూర్తి పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

**జిల్లాలో 18,22,470 మంది ఓటర్లు,**
**2183 పోలింగ్ కేంద్రాలు**

**పురుషులు 9,07,980, మహిళలు 9,14,379,**
**థర్డ్ జెండర్ 111 మంది**

**ఎన్నికల విధుల్లో 14,768 మంది సిబ్బంది**

**ఒంగోలు లోక్ సభ, 8 అసెంబ్లీల**
**ఎన్నిక బరిలో 165 మంది అభ్యర్థులు**

**ఓటింగ్ సరళిని వీక్షించేలా కలెక్టరేట్‌లో**
**ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం**






# ఎన్నికల సామాగ్రి తరలింపు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు కాలేజిలో ఒంగోలు నియోజకవర్గానికి సంబందించిన పోలింగ్ బూతుల వారిగా ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెట్ ప్రీసైడింగ్ ఆఫీసర్స్, అడిషనల్ ఆఫీసిర్, రూట్ ఆఫీసర్స్, ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని ప్రతి బూత్ సంబందించిన పార్లమెంట్ ఈవీఎంలు ఒక సెట్టు, అసెంబ్లీకి సంబందించిన ఈవీఎంలు ఒక సెట్టు, ఎలక్షన్ మెటీరియల్స్‌ను పోలీస్ ఎస్కర్ట్‌తో ఆర్టీసి బస్సుల్లో వాళ్లకు సంబందించిన పోలింగ్ స్టేషన్స్‌కు వెళ్ళటం జరిగింది. రిజర్వ్ ఈవీఎంలు ఆర్వో దగ్గర ఉంటాయి. రేపు ఉదయం 5 గంటలకు మాక్ పోలింగ్ జరుగుతుంది. 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభం అవుతుంది.

సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఒంగోలు ఆర్వో జీవి సుబ్బారెడ్డి, పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ జాన్సీలక్ష్మి, ఒంగోలు నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ యు. విశ్వేశ్వరరావు, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ జస్వంతారావు, ఒంగోలు తాసిల్దార్ సృజన్ కుమార్, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు వైసీపీ దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ రసూల్, బీజేపీ రాజశేఖర్, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : హిందూ సనాతన ధర్మానికి జగద్గురువు ఆది శంకరాచార్యులు పతాకగా నిలిచారని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షులు మైనంపాటి సాయికుమార్ ఆధ్వర్యంలో లాయరుపేటలోని హరేరామ నివాసంలో నిర్వహించిన జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలలో పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిపాదకుడిగా సనాతన ధర్మసారథిగా భారతదేశము నాలుగు వైపులా నాలుగు పీఠాలు ఏర్పాటు చేసిన వివేక భాస్కరుడు, విజ్ఞానశేఖరుడు జగద్గురు ఆదిశంకరా చార్యులు అని అన్నారు. ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షులు, కాలభైరవ ఉపాసకులు మైనంపాటి సాయికుమార్ మాట్లాడుతూ జగద్గురువు ఆదిశంకరాచార్య ఆరాధనతో తన జీవితంలో జరిగిన యదార్థ సంఘట నలను వివరించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు నేమ్మాని సీతారామ మూర్తి మాట్లాడుతూ ఆది శంకరులు నడయాడిన కాలంలోనే పేదల పక్షాన నిలిచాడని, అస్పృశ్యతను నిరసించాడని, మాతృదేవోభవ అంటూ తల్లిని ఆరాధించాడని అన్నారు. మరోఆధ్యాత్మిక ఉపన్యాసకులు చిలకపాటి రంగారావు మాట్లాడుతూ ఆదిశంకరులు రచించిన శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారా స్తోత్రం, భజగోవిందం ప్రజల నాలుకల మీద నేటికి నర్తిస్తున్నాయని అన్నారు. ముందుగా జగద్గురులు ఆదిశంకరుల చిత్రపటానికి పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, సూరపరాజు రాము, శివరాజు పుల్లయ్య, పొత్తూరు బదరి, ములుగు గంగాధర్, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ పరాంకుశం నరసింహాచార్యులు, మైనంపాటి హరినారాయణ, గడియారం సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నేతల నుండి నాకు ప్రాణహాని ఉంది

**– నాకు రక్షణ కల్పించండి, దాడి చేసిన వారిని శిక్షించండి**

**– మీడియాతో 16వ డివిజన్ కార్పొరేటర్ నాగభూషణం**



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఇటీవల తెలుగు దేశం పార్టీలోకి చేరిన నాపై వైసిపి నేతల బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారని 16వ డివిజన్ కార్పొరేటర్ నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. వైసిపిని వీడి తెలుగు దేశం పార్టీలోకి వచ్చినందుకు నాపై కక్ష కట్టి వైసిపి నేతలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. వైసిపికి చెందిన గోపాల్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, జమ్ము శ్రీకాంత్‌తో పాలు పలువురు బెదిరింపులకు పాల్పడుతున్నారని, తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టడం జరిగిందన్నారు. వైసిపి తీరు నచ్చక తెలుగు దేశం పార్టీలోకి చేరినట్లు తెలిపారు. స్వతంత్ర్య భారత దేశంలో స్వేచ్ఛగా జీవించే హక్కు, రాజ్యాంగానికి లోబడి నిర్ణయాలు తీసుకునే హక్కు, అధికారం మనకు ఉంటుందన్నారు. వైసిపి నేతల తీరు నచ్చక పార్టీని వీడానన్నారు. అప్పటి నుండి అనేక దఫాలుగా నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వైసిపి నేతల ఆగడాలను బాలినేని కట్టడి చేయాలని కోరారు. నాపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కామేపల్లి శ్రీను, తదితరులు ఉన్నారు.







కలెక్టరేట్లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ వీక్షణ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్‌కుమార్